క్లుప్తంగా

నెల పాటు గ్యాస్ట్రో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నుంచి వచ్చే నెల 18 వరకు నిర్వహించనున్నామని ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి పరీక్షలను 50 శాతం రాయితీపై చేయనున్నామని వివరించారు.

అంకమ్మ తల్లికి పూజలు



విడవలూరు: విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణలో పొంగళ్లను భక్తులు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు కొర్నాగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు..



కోవూరు: వడదెబ్బ తగలకుండా వాహనచోదకులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ చిలకల శ్రీహరిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. ఇనమడుగు రైల్వే గేట్ వద్ద వాహనచోదకుల సౌకర్యార్థం గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. పడుగుపాడు సర్పంచ్ చౌటూరు లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పట్టణంలోని పాతకాశీపాళెం భావనారుషీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వెంకటసుధాకర్ మాట్లాడారు. విద్యతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని చెప్పారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకొని తమ భవిష్యత్తుకు బాటలేసుకోవాలని సూచించారు. చేవూరు చలమయ్య, దోనిపర్తి శ్రీహరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం అంతమొందాలని కాంక్షిస్తూ..



ఇందుకూరుపేట: దేశవ్యాప్తంగా ఉగ్రవాదం అంతమొందాలని కాంక్షిస్తూ మైపాడు సముద్ర తీరంలో పూజలను మౌనానంద తపోవనం సౌభాగ్య భువనేశ్వరి పీఠం, విశాఖపట్నం స్వామి రామానందభారతి ఆదివారం నిర్వహించారు. అనంతరం గంగపట్నంలోని చాముండేశ్వరిదేవిని దర్శించుకున్నారు. పూర్ణకుంభం, మేళతాళాలతో ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. భక్తులందరూ వచ్చి ఆలయాల్లో పూజలు చేస్తే దేశం సుఖంగా ఉంటుందన్నారు.

డీఈఓ కార్యాలయ ముట్టడి జయప్రదానికి పిలుపు

కొడవలూరు: ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న డీఈఓ కార్యాలయ ముట్టడికి టీచర్లు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బచ్చు డేవిడ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయానికి ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోవాలని కోరారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- నగరంలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు
- పోలీస్ బీట్ డ్యూటీల పర్యవేక్షణ



నైట్ బీట్స్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. పోలీసుల తనిఖీలు ఫలితాలివ్వడం లేదు. వరుస హత్యలు, హత్యాయత్నాలతో నగర వాసులు భీతిల్లుతున్నారు. నేరస్తులు, అసాంఘిక శక్తులకు కొందరు రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా గడిచిన ఐదు నెలల్లో ఎనిమిది హత్యలు జరగడంతో శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. నేరాలను కట్టడి చేయాలని, నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ కృష్ణకాంత్ తరచూ ఆదేశిస్తున్నా.. కొందరు అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారు. దీంతో పోలీసు బాస్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో నగరంలోని ఆర్టీసీ, ఏసీ కూరగాయల మార్కెట్, మద్రాస్ బస్టాండు, వీఆర్సీ, గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్డు, నర్తకి సెంటర్, శెట్టిగుంటరోడు మినీబైపాస్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి ఆయన పర్యటించారు. దుకాణాలను పలు చోట్ల తెరిచి ఉండటంతో వాటిని మూయించారు. వాహన తనిఖీలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నైట్ బీట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. తాళాలేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, నిర్మానుష్య ప్రదేశాల్లో గస్తీని పెంచాలని సూచించారు. బీట్ సిబ్బంది విజిల్ కార్డు, టార్చ్‌లైట్ వెంట ఉంచుకోవాలని, అనుకోని ఘటనలు జరిగిన సమయంలో సమాచారాన్ని ఉన్నతాధికారులకు, నైట్ రౌండ్స్ అధికారికి తెలియజేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర పోలీస్ అధికారులు ఎస్పీ ఆదేశాలతో తనిఖీలను విస్తృతం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నగరంలోని రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్‌ను పోలీసులు ఆదివారం నిర్వహించారు. ఏఎస్పీ సౌజన్య పర్యవేక్షణలో దీన్ని ఏర్పాటు చేశారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలను మూయాలని ఆదేశిస్తున్న పోలీసులు

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని విజయభాస్కర్‌రెడ్డి చేపట్టారు. ముఖ్యఅతిథులుగా డీటీసీ చందర్, బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరి పొన్నం రవిచంద్ర, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, స్వర్ణ రమేష్, గఫార్, రాజా, రమేష్, విజయమోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(బారకాసు): ప్రగతినగర్ మెయిన్ రోడ్డులో మినరల్ వాటర్, మజ్జిగ చలివేంద్రాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఏకొల్లు శిల్ప జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు, అధ్యక్షుడు వెంకట సూర్య, సభ్యులు శ్రీకాంత్, ధనలక్ష్మి, అఖిల, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏడు ప్రతిపాదనల అమలు



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు సిటీ: మినీ మహానాడులో నేతలు ప్రతిపాదించిన ఏడు అంశాలను అమలు చేయన్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. గోమతినగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. సిటీలో ఏర్పాటు కానున్న ఎమ్మెస్సెమ్‌ఈ పార్కు ద్వారా ఐదు వేల మందికి ఉపాధి కల్పించనున్నామని వెల్లడించారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ సిటీ అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

కాంపాక్టర్ వాహనాల ప్రారంభం

నగరపాలక సంస్థ పరిధిలో చెత్తను తరలించేందుకు గానూ రూ.ఏడు కోట్ల విలువజేసే ఆరు కాంపాక్టర్లను మంత్రి నారాయణ ప్రారంభించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రిప్పులో 32 టన్నుల చెత్తను తరలించనున్నారని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో వీటిని కొనుగోలు చేశామని వివరించారు.

12న వీఆర్ హైస్కూల్ పునఃప్రారంభం

వీఆర్ హైస్కూల్‌ను వచ్చే నెల 12న పునఃప్రారంభించనున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏడాదికి వెయ్యి మందికి చొప్పున ప్రవేశాలను కల్పించనున్నామని వెల్లడించారు. అవసరమైతే పీ4 కింద పేద పిల్లలకు అండగా నిలుస్తామని చెప్పారు. కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు కృషి చేద్దాం



నివాళులర్పిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ దీక్ష చేసి అమరజీవిగా నిలిచిన పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహానికి కమిషనర్ ఆదివారం నివాళులర్పించారు.



బీజేపీ ఆధ్వర్యంలో..

నెల్లూరు రూరల్: మూలాపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి బీజేపీ నేతలు నివాళులర్పించారు. నేతలు మిడతల రమేష్, పద్మావతి, నాగలక్ష్మి, సుబ్బయ్య, మనోశ్రావ్య, సరస్వతి, శిరీష, చంద్ర, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై ముగిసిన తరగతులు

నెల్లూరు(బృందావనం): టెక్కేమిట్టలోని అమీర్ ఆర్ట్స్ అకాడమీలో 20 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అందజేశారు. అనంతరం కళారత్న అవార్డును అందుకున్న హాస్యనటుడు దోర్నాల హరిబాబును సత్కరించారు. కళాసంఘాల కన్వీనర్ భాస్కర్, డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసులురెడ్డి, విశ్వం స్కూల్ కరస్పాండెంట్ బాలకృష్ణ, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డు విస్తరణ పనుల దృష్ట్యా స్తంభాలను మార్చనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీ కాలనీ, సారాయంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమినగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తన విభావరి



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తన విభావరి అలరించింది. అన్నమాచార్యులు సంకీర్తనలను 50 మందికి పైగా విద్యార్థులు ఆలపించారు. గురుకృప, భారతి సంగీత విద్యాలయాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. వాద్య సహకారాన్ని సుబ్రహ్మణ్యం, ఈశ్వర్‌పాయ్ అందించగా, వ్యాఖ్యాతగా దువ్వూరు బెనర్జీ వ్యవహరించారు. సంగీత విద్వాంసులు లక్ష్మీప్రసన్న, రమాదేవి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడు నాగకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ





నెల్లూరు సిటీ: కేవీఆర్ పెట్రోల్ బంక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీని ఉత్సాహంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగాలను కొనియాడారు. మరోసారి తోకజాడిస్తే ప్రపంచ పటంలో పాకిస్థాన్ కనిపించదని చెప్పారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: భారత ఆర్మీకి సంఘీభావంగా కోటమిట్టలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి తిరంగా ర్యాలీని నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సత్య, సాయి, అంకయ్య, భార్గవ్, లక్ష్మి, మధు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలతో ఎంతో ఉపయోగం

నెల్లూరు(బారకాసు): జాబ్ మేళాలతో యువతకు ఎంతో ఉపయోగమని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. నగరంలోని ఆరెస్సార్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఆదివారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ నందన్ పరిశీలించారు. కిడ్స్ ప్లే గ్రౌండ్ తదితర నిర్మాణాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నారులకు ఆహ్లాదకరంగా అన్ని ఆట వస్తువులను ఏర్పాటు చేసి, ప్రాంగణంలో మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

హెచ్ఐవీ రోగులను ఆదరిద్దాం



కొవ్వొత్తులతో ర్యాలీ

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీకి గురై ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. హెచ్ఐవీతో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం, ఆత్మశాంతి కోసం ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ ర్యాలీని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయం నుంచి ములుమూడి బస్టాండ్ తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం ఆమె మాట్లాడారు. హెచ్ఐవీ రహిత జిల్లాగా నెల్లూరును మారుద్దామని చెప్పారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మౌనం పాటించారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా.. అస్తవ్యస్తం

- లో ఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు, గృహోపకరణాలు
- కాలంచెల్లిన కేబుళ్లతో సమస్య
- స్తంభాలొచ్చినా లైన్ వేయని అధికారులు
- ఐదేళ్లుగా 150 కుటుంబాల అగచాట్లు
- 53వ డివిజన్లో ఇదీ దుస్థితి



ఇళ్లపై లైన్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో.. లో ఓల్టేజీ సమస్య ఎప్పుడొచ్చి గృహోపకరణాలు కాలిపోతాయోననే ఆందోళనతో నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్, షుగర్ ఫ్యాక్టరీ సమీప ప్రాంత వాసులు కాలం వెళ్లదీస్తున్నారు. సాయంత్రం ఆరు దాటిందంటే వీరి వెతలు వర్ణనాతీతమవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో దాదాపు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఐదేళ్లుగా సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజీ సమస్య ఏర్పడింది. కాలం చెల్లిన ఏబీ కేబుళ్ల ద్వారా విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో పీక్ అవర్స్‌లో అవి కాలిపోయి తెగిపోతున్నాయి. విద్యుత్ సిబ్బంది సమాచారం అందుకోవడం.. తెగిపోయిన కేబుళ్లను అతికించడం.. సమస్య మళ్లీ మొదటికి రావడం.. ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. నూతన లైన్లు, స్తంభాలొచ్చినా వాటిని ఏర్పాటు చేయడంలో అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కాలం చెల్లిన కేబుళ్ల ద్వారా విద్యుత్ సరఫరా



నిరుపయోగంగా స్తంభాలు

రాత్రి వేళ అగచాట్లే



మా ప్రాంతంలో రాత్రి వేళ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఐదేళ్లుగా ఇదే సమస్య నెలకొంది. కొన్ని సమయాల్లో లో ఓల్టేజీ వస్తోంది. అల్యూమినియం వైర్లతో లైన్లు లాగి త్రీఫేజ్ కరెంట్ ఇస్తే మా సమస్య తీరుతుంది. లో ఓల్టేజీతో గృహోపకరణాలు కాలిపోతున్నాయి.

– రబ్బానీ, కిరాణా వ్యాపారి

మరమ్మతులకే తడిసిమోపుడు



లో ఓల్టేజీ సమస్యతో తోపుడు మెషీన్ కాలిపోతోంది. దీని మరమ్మతులకు తడిసిమోపెడవుతోంది. మరోవైపు ఈ పరిణామాలతో వ్యాపారమూ జరగడంలేదు. సాయంత్రం ఆరయ్యాక దుకాణాన్ని మూసి ఇంటికెళ్లాల్సి వస్తోంది. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– బషీర్